మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ ఇంటికి హరీశ్‌రావు..!!

**- తేనీరు సేవించిన తన్నీరు..**



**భూత్పూర్,జనవరి 7,ప్రభాతవార్త :** మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీశ్‌రావు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కు వచ్చి ఆల కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఆహ్వానం మేరకు జాతీయ రహదారి కూడలిలో భూత్పూర్‌లోని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్ ఇంటికి వెళ్లి కాసేపు సేదతీరారు. అనంతరం చైర్మన్ ఇంట్లో తేనీటి విందును సేవించారు. చైర్మన్ ఇంటికి వచ్చిన హరీశ్ రావును పలువురు బీఆర్ఎస్ నాయకులు కలుసుకున్నారు. హరీశ్‌రావును కలిసిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు సత్తూర్ నారాయణ గౌడ్,టి మురళీధర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,ముడా డైరెక్టర్ సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్‌తో పాటు నాయకులు సత్తూర్ అశోక్‌గౌడ్, వడ్ల బ్రహ్మయ్య,గడ్డం రాములు,సత్తూర్ సదానంద్‌గౌడ్,మాల విఠల్‌దాస్ వెంకటేష్ ఉన్నారు.

## గ్రామస్తులు భయాన్ని వీడి స్వేచ్ఛగా జీవించండి..

**నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి**


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కోయిల్‌కొండ, జనవరి 07 ప్రభాతవార్త :** ఎల్లారెడ్డిపల్లి గ్రామస్తులు భయాన్ని వీడి స్వేచ్ఛగా జీవించండని నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికరెడ్డి గ్రామస్తులకు సూచించారు. ఆదివారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన వైద్య బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి మరెన్నో ఉచితవైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్నారు. రోడ్డు సౌకర్యం, బస్సు సౌకర్యం త్వరలోనే కల్పిస్తానని గ్రామస్తులు అడిగిన పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ వైద్య శిబిరం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన డా. హనిమిరెడ్డి ఆధ్వర్యంలో కొనసాగింది.

**క్రీడలలో గెలుపోటములు సహజం:ఎమ్మెల్యే పర్ణికరెడ్డి**

మండలంలోని సూరారం గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నారాయణపేట ఎమ్మెల్యే డా. పర్ణికరెడ్డి ప్రారంభించారు. క్రీడారంగంలో రాణించేవారు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే యువతకు సూచించారు. క్రీడలలో ఓటమి చెందిన అది భవిష్యత్తులో గెలుపుకు నాంది పలుకుతుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.రవిందర్, ఎంపిటిసి రోజా జగన్‌గౌడ్, గార్లపాడు నరసింహారెడ్డి, సంఘనోనిపల్లి యాదయ్య, నారాయణరెడ్డి, సూరారం శ్రీ కృష్ణ, పేట సోషల్ మీడియా కన్వీనర్ ఎం.రామస్వామి, మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌస్, నాయకులు బండి నాగరాజు, టైలర్ బాలు, విక్రం, జి. మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు భూ నష్టపరిహారం చెల్లించకపోవడంతో నిలిచిన కేఎల్ఐ పనులు:ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**వెల్దండ, జనవరి 07 ప్రభాతవార్త:** మన ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన కేఎల్ఐ కాల్వ చివరి ఆయాకట్టు వరకు సాగునీరు సాగదీత అయ్యిందే తప్ప మరోకటి కాదని, గత ప్రభుత్వ తప్పిదాల వల్లనే మన ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హజరై మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత కేఎల్ఐ సాగునీటి కాలువపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించానని, మండలంలోని చెర్కూర్ గ్రామ సమీపంలో పనులు ఎందుకు నిలిచాయని అధికారులను ప్రశ్నించగా.. గత ప్రభుత్వంలో కేవలం ఒక రైతుకు రూ.5.30లక్షల భూ నష్ట పరిహారం చెల్లించకపోవడంతోనే పనులు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించే విధంగా అధికారులను ఆదేశించానని, రైతుకు భూ నష్ట పరిహారం చెల్లించి త్వరలో కాల్వ పనులను ప్రారంభిస్తామన్నారు. గతంలోనే రైతుకు నష్ట పరిహారం అందిస్తే ఇది వరకే పనులు పూర్తై ఎంతో మంది రైతులకు చేకూరనుందన్నారు.

## ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషి...

**-ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 07 ప్రభాతవార్త:** ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జేఎస్ ఆర్ గార్డెన్‌లో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ తన విజయానికి సంపూర్ణ సహకారం అందజేసిన ముస్లిం మైనార్టీలకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మైనార్టీల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే విధంగా చర్యలు చేపడుతామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

## భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ 2024 పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన రాజశేఖర్‌రావు


గోల్డ్ మెడల్ సాధించిన రాజశేఖర్‌రావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 07 ప్రభాతవార్త:** 4వ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ గుజరాత్ రాష్ట్రంలో జునాగర్‌లోని డాక్టర్ హరిభాయి గోదాని క్యాంపస్‌లో తేదీ:06-01-2024 మరియు 07-01-2024లో నిర్వహించారు. కార్యక్రమానికి నాసా శాస్త్రవేత్త రుతు ఫారేఖ్, ఇస్రో శాస్రవేత్తలు ముఖ్య అతిథిగా వచ్చారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శాస్త్రీయ దృక్పదంపై అవగాహన కల్పించడం కోసం దేశంలో దాదాపు 20 రాష్ట్రాల్లో చురుకుగా పనిచేస్తూ దేశ వ్యాప్తంగా అనేక సైన్స్ కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌ను నిర్వహించారు. నేషనల్ టీచర్ సైంటిస్ట్ కౌన్సిల్, రామన్ సైన్స్ టెక్నాలజీ ఫౌండేషన్‌తో పాటు మొదలుగా సంస్థలు కలిసి దేశ వ్యాప్తంగా విద్యార్థుల మధ్య సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల ఉపాధ్యాయులు పాల్గొనగా... తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీహెచ్ఎస్ వెన్నచెర్ల పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు టి.రాజశేఖర్‌రావు పాల్గొని అతను ప్రదర్శించిన ప్రదర్శనకు గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. రాజశేఖర్‌రావు గోల్డ్ మెడల్ సాధించడం పట్ల జిల్లా విద్యాధికారి గోవింద రాజులు, సైన్స్ అధికారి కృష్ణారెడ్డిలు చరవాణి ద్వారా ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రాయికోడ్‌లో ఘనంగా గంధోత్సవం పాల్గొన్న ప్రజాప్రతినిధులు



**నారాయణపేట ప్రతినిధి,జనవరి 07 ప్రభాతవార్త :** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మహబూబ్ హుస్సేన్ జాతర ఉత్సవాల సందర్భంగా ఆదివారం గంధోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామసర్పంచ్ డి. సుశీల శ్రీనివాసులు, ఎల్. శ్రీనివాస్‌రెడ్డిల ఇండ్ల నుండి ఇరు వర్గాల మధ్య గంధాన్ని తీసుకెళ్లారు. గంధాన్ని అందంగా అలంకరించి బ్యాండ్‌తో ఊరేగింపుగా తరలించారు. అనంతరం ఇండ్ల నుండి తీసుకెళ్లిన గంధాన్ని దేవునికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు. కుల మతాలకతీతంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. గంధాన్ని తిలకించేందుకు గ్రామ ప్రజలు ముస్లిం, మైనార్టీ పెద్దలు, యువకులు పెద్దఎత్తున తరలి వచ్చారు. గంధం ఫతేహా ఇచ్చిన అనంతరం రాయికోడ్‌లో మహబూబ్ హుసేన్ ఉత్సవాలు ప్రారంభమవు తాయని గంధోత్సవ కమిటి సభ్యులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా ఎస్సై కుర్మయ్య ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు.


ఊరేగింపుగా గంధోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## మండలంలో ఆధార్ అప్డేట్ కేంద్రం నిర్వహణ..

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 07 ప్రభాతవార్త :** ప్రజల, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు మక్తల్ ఐకెపి సెంటర్‌లో మూడు ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈనెల 8 నుండి 12 వరకు స్పెషల్ క్యాంపెయిన్ క్రింద ఆధార్ అప్డేట్ కేంద్రం ఉదయం 10 గం.ల నుంచి సాయంత్రం 5 గం.ల వరకు అందుబాటులో ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.


జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

## పాలనపై ఎమ్మెల్యేల మార్క్..!









- ఒక్కొక్కరిది ఒక్కో పంథ..
- నూతన ఒరవడి తీసుకొస్తున్న నేతలు
- హంగులు, ఆర్భాటాలకు దూరంగా ఒకరు..
- ఇతర పార్టీలకు నో ఎంట్రీ చెబుతూ మరొకరు..
- పోలీస్ ఎస్కార్ట్ వద్దందటూ ఇంకొకరు..
- జనాల ఆశలన్నీ ఆరు గ్యారంటీలపైనే..
- నెలరోజుల ప్రజాపాలనపై ప్రత్యేక కథనం..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 7, ప్రభాతవార్త:** ఒకరేమో క్యాంప్ కార్యాలయమే కేంద్రంగా పాలన కొనసాగిస్తుంటే, మరొకరు తనకు ఎస్కార్ట్ వద్దనుకుని ప్రజల కోసమే ఉపయోగించాలని మరొకరు, ఇంకొకరేమో ఇతర పార్టీల నాయకులకు నో ఎంట్రీ అంటూ తమదైన శైలిలో ప్రత్యేకతను చాటుకుంటూ పాలన కొనసాగిస్తున్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి నెల రోజులువు పూర్తయింది. బీఆర్ఎస్ అవినీతి అరాచక పాలనకు చమరగీతం పాడుతామంటూ చెప్పినట్లుగానే అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి పాలమూరులోని 14 స్థానాల్లో 12స్థానాల్లో విజయదుందుభీ మోగించింది. అయితే మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిన సంగతి తెలిసిందే. అయితే మూడు నియోజకవర్గాల్లో ఒక్కో ఎమ్మెల్యేది ఒక్కో ప్రత్యేకమైన శైలిలో పాలన కొనసాగుతున్నది.



- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల ముందునుంచే మహబూబ్‌నగర్ ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవనం సాగించేలా అవకాశం కల్పిస్తామంటూ, అవినీతి అరాచక, అక్రమ పాలనకు అంతం పలుకుతామంటూ ప్రజలు వ్యాపారులు స్వేచ్ఛగా తమ వ్యవహారాలు వ్యాపారాలు నిర్వహించుకునే దిశగా అడుగులు వేస్తామంటూ చెప్పుకుంటూ వచ్చారు. హంగులు ఆర్భాటాలకు దూరంగా ఉంటూ తనదైన శైలిలో ముందుకుసాగుతున్నారు. తన జన్మదిన వేడుకలను కూడా అత్యంత నిరాడంబరంగా చేయాలని, తనకు బొకేలు, శాలువాలు, పూలమాలలు తీసుకురావొద్దంటూ నిర్ణయం తీసుకొని అందరినీ ఆశ్చర్య పర్చారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు తీసుకురావాలని పిలుపునిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు.



- జడ్చర్ల ఎమ్మెల్యేగా జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గెలిచిన నాటి నుంచే ఇసుక అక్రమరవాణాపై, అవినీతి అక్రమాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వచ్చారు. ఈమేరకు పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులను తమ పార్టీలో చేర్చుకునే అవసరం లేదంటూ తేల్చి చెప్పారు. తన గెలుపుకోసం కృషి చేసిన కార్యకర్తలనే నాయకులుగా తయారు చేస్తామంటూ మీడియా సమావేశంలోనూ వెల్లడించారు. అదేవిధంగా ఇటీవల పోలీస్ ఎస్కార్ట్ తనకు వద్దంటూ నిర్ణయం తీసుకోవడంతో నెటిజన్లు అనిరుధ్‌రెడ్డిపై ప్రశంసలు కురిపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారర్ చెక్కుల విషయంలోనూ ఎవరు కూడా క్యాంప్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదని, ఇంటి వద్దకే చెక్కులు పంపిస్తామని చెప్పాను. ఫొటోల కోసం కారక్రమం చేయాల్సిన అవసరం లేదంటూ చెప్పి అందరి దృష్టిని ఆకర్షించారు.



- దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదర్‌రెడ్డి తనదైన శైలిలో పాలన కొనసాగిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా, మట్టి తరలింపు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇసుకఅక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఇతర పార్టీల వారిని చేర్చుకోనంటూ తేల్చి చెప్పారు. గత పదేండ్లుగా పార్టీకోసం పని చేసిన వారికే ప్రాధాన్యత ఇస్తామంటూ చెబుతున్నారు. అయితే నెల రోజులపాలన పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి ట్వీట్ చేసిన నేపథ్యంలో జనాల్లో మరింత ఆశాభావం పెరిగింది. సంకెళ్లను తెంచిస్వేచ్ఛను పంచామని, ప్రజల ఆకాంక్షలను నిజం చేస్తూ ఉజ్వల భవితవైపు అడుగులు వేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదిక ట్వీట్ చేయడం సోషల్ మీడియాలో వైరల్ అవతున్నది. ఏది ఏమైనా 100రోజుల్లో ఆరుగ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా అడుగులు వేస్తున్నది. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతోపాటు రూ.10లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించడం జరిగింది. మహిళలకు రూ.2500, గ్యాస్ సిలిండర్ రూ.500కే పథకం అందజేసే పథకంపై కూడా సీఎం సమీక్షించడంతో మహిళల్లో మరింత ఉత్సాహం నింపుతున్నది.

## అమరచింత మున్సిపాలిటిని ఆదర్శ మున్సిపాలిటీగా.. అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**అమరచింత,జనవరి 7,ప్రభాతవార్త :** సమిష్టి కృషితో అమరచింత మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే,వాకిటి శ్రీహరి అన్నారు.ఆదివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం మక్తల్ ఎమ్మెల్యే,వాకిటి శ్రీహరి,పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి,కేశం నాగరాజు గౌడ్ కలిసి మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్ రెడ్డి తో అమరచింత పట్టణ అభివృద్ధిపై చర్చించారు.అనంతరం పట్టణంలో ప్రభుత్వ ఆసు పత్రి స్థాయిని ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా డాక్టర్స్‌ని నియమించాలని.పట్టణంలో మురుగు కాలువలను,నిర్మించాలని పట్టణంలో విద్యుత్ వైర్లు వల్ల ప్రమాదం వాటిల్లు తుండని తక్షణమే కె.విలైన్‌లకు నూతన విద్యుత్ వైర్లు వేయాలని,మున్సిపాలిటీగా మారినందున పట్టణంలో టౌన్ హాల్,గ్రంథాలయం,డంపింగ్ యార్డ్ సమస్యలను తక్షణమే మక్తల్ ఎమ్మెల్యే,వాకిటి శ్రీహరి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పట్టణ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని,మాజీ అడ్వకేట్ జనరల్ దేశ ప్రకాష్ రెడ్డి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్,డిసిసి జిల్లా కార్యదర్శి,అయూబ్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్,మాజీ ఎంపిటిసిలు, మహంకాళి విష్ణు,తిరుమలేష్,విష్ణు,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


మక్తల్ ఎమ్మెల్యే,వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర మాజీ జనరల్ దేశాయ్ ప్రకాష్ రెడ్డి,పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి,కేశం నాగరాజుగౌడ్


మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న మాజీ అడ్వకేట్ జనరల్ దేశ ప్రకాష్ రెడ్డి

## శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్..

**గద్వాల ప్రతినిధి,జనవరి 07 ప్రభాతవార్త :** సమస్యాత్మక ప్రాంతాలలో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిత్యం ప్రజల వెన్నంటి ఉన్నారని నమ్మకం కల్పించడమే ఫ్లాగ్ మార్చ్ ప్రధాన లక్ష్యమని గద్వాల పట్టణ ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు ఆర్ఏఎఫ్ డిప్యూటి కమాండెంట్ ఎం. నరేష్‌కుమార్ బృందంతో కలిసి జిల్లా కేంద్రంలో పోలీసులు కవాతు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎక్కడ విఘాతం కలిగినా ప్రజలలో భరోసా, ధైర్యం కల్పించడం లక్ష్యంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తామని చెప్పారు. పోలీస్ వ్యవస్థ ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతియుత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నదని చెప్పారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేసే పోలీసులకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పోలీసులు నిరంతరం వారి వెన్నంటి ఉంటారన్న భరోసా కల్పించడం లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారని చెప్పారు. పోలీస్ శాఖ ప్రజలకు నిరంతరం వెన్నంటి ఉన్నామని చెప్పడం, వారికి పోలీస్ వ్యవస్థపై మరింత నమ్మకం కల్పించడానికే కవాతు నిర్వహించినట్లు తెలిపారు. చింతలపేటలో ప్రారంభం అయిన కవాతు ఫిష్ మార్కెట్, ఒంటెలపేట, బిసి కాలనీ, మొహిన్‌మల్ల, గంజిపేట, రాజవీధి వద్దకు చేరుకుంది. ఫ్లాగ్ మార్చ్‌లో ఆర్ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కాంబ్లే, వినాయక్ కాశినాథ్, గద్వాల పట్టణ ఎస్సై కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్ ఆవరణలో కేంద్ర పోలీస్ బలగాలతో పట్టణ ఎస్సైలు

## రాముల వారి అక్షింతలు సమర్పించిన ఎమ్మెల్యే

**వనపర్తి టౌన్,జనవరి 7,ప్రభాతవార్త :** ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రాముల వారి విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా దేశవ్యాప్తంగా రాములవారి అక్షింతలను పంపిణీ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆదివారం వనపర్తి పట్టణంలోని 9 వార్డ్ విద్యానగర్ కాలనీలో గల పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి రాములవారి అక్షింతలను సమర్పించారు.రాములవారి అక్షింతలను తలపై మోస్తూ ఊరేగింపుగా వెళ్లి ఆంజనేయస్వామి ఆలయంలో సమర్పించారు. అనంతరం ఆలయంలోని పంచముఖి ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న సమస్యల గురించి ఎమ్మెల్యేకు వివరించారు.అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేతో పూల మొక్కను నాటించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జయసుధ మధు,రవి యాదవ్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్,చీర్ల ఆంజనేయులు,రాములు,చెంద్రమౌళి,కాలనీవాసులు ఈశ్వ రచారి,శశి తదితరులు పాల్గొన్నారు.


రాముల వారి అక్షింతలు సమర్పించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



## పాలమూరు కో ఆర్డినేటర్‌గా సీఎం..

**- పార్లమెంట్ నియోజకవర్గాలకు కేటాయించిన అధిష్టానం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 7, ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్టానం ముందస్తుగానే అడుగులు వేస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది, పార్లమెంట్ నియోజకవర్గాలకు ఓ ఆర్టినేటర్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈమేరకు రాష్ట్రంలోని 17పార్లమెంట్ స్థానాలకు కో ఆర్డినేటర్లను నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండుపార్లమెంట్ స్థానాల కు కూడా కో ఆర్డినేటర్లను కేటాయిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా సీఎం రేవంత్‌రెడ్డిని నియమించగా, నాగర్‌కర్నూల్ పార్లమెటర్ కో ఆర్డినేటర్‌గా జూపల్లి కృష్ణారావుకు కేటాయించింది. అయితే మహబూబ్‌నగర్‌తోపాటు చేవేళ్ల నియోజకవర్గ బాధ్యతలు కూడా రేవంత్‌రెడ్డికే అప్పగించారు.


రేవంత్‌రెడ్డి


జూపల్లి కృష్ణారావు

## ఆల కుటుంబానికి పరామర్శ..!!

**-పరామర్శించిన హరీశ్,చల్లా,కొత్త,మర్రి,అల్లీపూర్,ఎర్రోళ్ల తదితరులు..**



**భూత్పూర్,జనవరి 7,ప్రభాతవార్త :** తన కుడిభుజమైన భ్రాత ఆల శివర్ధన్‌రెడ్డిని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని ఆయన కుటుంబాన్ని ఆదివారం పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. ఈ నెల 4వ తేది దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల సోదరుడు ఆల శివర్ధన్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆదివారం మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీశ్‌రావు మహబూబనగర్ జిల్లా భూత్పూర్ మండలం ఆల స్వగ్రామం అన్నాసాగర్‌కు వచ్చారు. హరీశ్‌రావు అన్నాసాగర్‌లో స్వర్గీయ ఆల శివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆల కుటుంబ సభ్యుల్ని హరీశ్‌రావు పరామర్శించారు.హరీశ్‌రావు వెంట దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామారెడ్డి,నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి,బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మాజీ చైర్మన్ అల్లీపూర్ వెంకటేశ్వర్‌రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్,ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టి మురళిధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## అంత్యక్రియలకు అభిమన్యుడి ఆర్థిక సహాయం..



**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 07 ప్రభాతవార్త :** ఆపద వస్తే నేనున్నానంటూ భరోసానిస్తున్నారు ఎంపిటిసి,బిఆర్ఎస్ యువనాయకుడు చించోడ్అభిమన్యురెడ్డి, రాజాపూర్ మండలంలోని నాన్ చెరువుతండా గ్రామపంచాయతీలో జటావత్ శాంతి(45) అనారోగ్యంతో మరణించారు.విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ యువనాయకుడు అభిమన్యురెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢసానుభూతి ప్రకటించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసహాయాన్ని యువ సేనసభ్యుల ద్వారా అందించారు. కార్యక్రమంలో సరనపంచ్ గోరి రవినాయక్, ఎంపిటిసి వెంకట్‌నాయక్, రాజాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు పాండునాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, సక్రియానాయక్, బాలియా, పాండునాయక్, బిఆర్ఎస్ నాయకులు, యువసేన సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేస్తా..



**బిజినేపల్లి,జనవరి 07 ప్రభాతవార్త :** ముదిరాజ్‌లు ఐకమత్యంతో ముందుకు సాగాలని మత్స్యకారుల అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మత్స్య కార్మిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మల అల్లోజి అన్నారు. మండల కేంద్రంలోని మల్లికార్జున మత్స్య కార్మిక సహకార సంఘం భవనంలో ఆదివారం సన్మానసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మల అల్లోజీ మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలని, ముదిరాజ్ బిడ్డలు వ్యాపార రంగంలో గాని విద్య, వైద్యరంగాలలో అభివృద్ధి చెందాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్‌లు కలిసి కట్టుగా పోరాడి ముదిరాజ్‌ల హక్కులు సాధించుకోవాలని అన్నారు. అలాగే ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని అన్నారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు కంపిల్ల పర్వతాలు, చిరంజీవి, మావిళ్ళ ఆంజనేయులు, పెంటయ్య, నరసమ్మ, రుక్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఇక నిరంతరాయం..



**మహబూబ్‌నగర్,జనవరి 07 ప్రభాతవార్త :** గ్యాస్‌బుక్ చేయలేదని సిలిండర్ అయిపోయింది ఎలా అని దిగులు ఇక అవసరం లేదంటున్నారు బోడజానంపేట ప్రాంతానికి చెందిన మెగా సిటీగ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు. వారు పైప్‌లైన్ ద్వారా ఇంటింటికి వంట గ్యాస్ ఇస్తున్నామని ఈ విధానం ద్వారా వినియోగదారులకు సమయం ఆదా అవుతుందని చెబుతున్నారు. వంట ఇంట్లో గ్యాస్ సిలిండర్ అయిపోగానే సిలిండర్ కోసం పరుగులు తీయాల్సిన రోజులకు కాలం చెల్లిందని చెబుతున్నారు. బోడజానంపేట గ్రామంలో ఇంటింటికి గ్యాస్ సరఫరా చేసేందుకు పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. పనులను ఇదే ప్రాంతానికి చెందిన మెగా గ్యాస్ వారు ఇంటింటికి గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గుడిసె బాబయ్య, వార్డు మెంబర్లు, మెగా గ్యాస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్యాస్ పైపుల ద్వారా లీకైన ప్రమాదం లేదని, గ్యాస్ పైప్‌లైన్‌ను తనిఖీ చేసేందుకు పెట్రోలింగ్‌కు కూడా తమ సంస్థకు సంబంధించిన సిబ్బంది ఉంటారని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

**ట్రయల్ రన్ విజయవంతం...** బోడజానంపేట గ్రామంలో పైపుల ద్వారా గ్యాస్ సరఫరా ఎలా జరుగుతుందో తెలుసుకునే ట్రయల్‌రన్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాజెక్టు మేనేజర్ అవినాష్, సర్పంచ్, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గిరిజన మహిళాకు డాక్టరేట్...



**వెల్దండ, జనవరి 07 ప్రభాతవార్త:** మండలంలోని పోచమ్మగడ్డ తాండ గ్రామ పంచాయతీలోని దుబ్బతాండకు చెందిన జర్పుల జ్యోతి అనంతపూర్ జిల్లాలో పీహెచ్‌డీ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ విభాగంలో పట్టభద్రులయ్యారు. అనంతపూర్ జవహర్ లాల్ నెహ్రు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. మండలంలో మొదటి సారిగా గిరిజన మహిళా పీహెచ్‌డీ పట్టా అందుకోవడం చాలా సంతోషకరంగా ఉందని పలువురు అభినందించారు. జర్పుల జ్యోతి ప్రస్తుతం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

## వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన..



**నారాయణపేట ప్రతినిధి,జనవరి 07 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో వాహనదారులకు పెండింగ్ చలాన్లపై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలకు పెండింగ్‌లో చలాన్లను 10వ తేదీ వరకు రాయితీ ఉన్నందున వెంటనే చెల్లించాలని ప్రభుత్వం కల్పించిన రాయితీని అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కొన్ని సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, రోడ్డుపై వాహనాలను పార్కు చేయరాదని, టూవీలర్స్‌పై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను, కూలీలను ఎక్కించుకోరాదని, ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంతవరకే ప్యాసింజర్‌లను ఎక్కించుకోవాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని పరిమిత వేగంలో వాహనాలు నడపాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు తిరుపతి, భగవంతు,దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండలో కన్నులపండువలా తిరుచ్చిసేవ..!

**-అలంకరణలో శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి దర్శనం**

**దేవరకద్ర,జనవరి 07 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు,భక్తుల హరినామశ్మరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**-అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూదేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది శ్రీకాంత్,సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్యంకొండలో తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

# ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం



వజ్రోత్సవాల సమ్మేళనానికి నిధులను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**బిజినేపల్లి,జనవరి 07 ప్రభాతవార్త :** పాలెం విద్యా సంస్థల వజ్రోత్సవ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి పూర్వ విద్యార్థి భాగస్వామ్యం కావాలని పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు సభ్యులు బాలకిష్టయ్య సూచించారు. జనవరి 28న నిర్వహించ తలపెట్టిన వజ్రోత్సవాల 11వ ప్రిపరేటరీ మీటింగ్ సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో వజ్రోత్సవాల సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు నిధులను చెక్కుల రూపంలో అందించారు. పూర్వ విద్యార్థి కాశిరెడ్డి గోపాల్‌రెడ్డి తన బ్యాచ్ తరపున 50 వేల రూపాయల చెక్కును అందించారు. 1975 ఎస్ఎస్‌సీ బ్యాచ్ తరపున రిటైర్డ్ ప్రిన్సిపల్ కృష్ణగౌడ్ రూ. 60636 చెక్కు అందించారు. పూర్వ విద్యార్థి శారద టీచర్ పదివేల రూపాయలు అందించారు. పాలెం విద్యాసంస్థలో చదివిన ప్రతి విద్యార్థి ఈ సమావేశానికి హాజరై తాము ఇంత స్థానానికి ఎదగడానికి కారణమైన తోటపల్లి సుబ్బయ్య జ్ఞాపకాలను నెమరేసుకుందామని వివరించారు. వజ్రోత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ముఖ్య అతిథగా హాజరు కానున్నట్లు వివరించారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావించిన సుబ్బయ్య విద్యా సంస్థలను స్థాపించారని, ఆయన నాటిన విద్యావృక్షం 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ సంబరాలలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని కోరారు. స్వచ్చందంగా వచ్చి బాధ్యతలలో పాలు పంచుకోవాలని కోరారు. పాలెం విద్యా సంస్థల్లో చదివిన వారెందరో దేశ విదేశాలతో పాటు వివిధ రంగాల్లో, ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. నాడు పాలెం అంటే బడి గుడి అని ఎంతోమంది చెప్పేవారని గుర్తు చేశారు. వజ్రోత్సవ వేడుకలకు సంబంధించి నిర్వహణ, నిధుల సేకరణ తదితర అంశాలపై చర్చించా రు. వజ్రోత్సవాలకు సంబంధించిన ఆర్గనైజింగ్ కమిటి సభ్యుల ఎంపికను పూర్తి చేశారు. సమావేశంలో ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, జాయింట్ ట్రెజరర్ లక్ష్మీకాంతం, డా. మల్లికార్జున్, గాడిసురెందర్, గోపాలస్వామి, న్యాయవాది ప్రవీణ్, జగన్‌మోహన్, శివకుమార్, చంద్రశేఖర్, యాదగిరి, జగదీశ్వర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు రూ 26 వేలు కనీస వేతనం ఇవ్వాలి..

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్**



ఏఐటియుసి నాయకుల మహాసభ

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 07 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు వంటలు వండి భోజనాలు పెడుతున్న మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 26 వేలరూపాయల కనీస వేతనం అమలు చేయాలని ఏఐటియుసి నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన కార్మికుల వర్కర్స్ యూనియన్ మండల మహాసభకు ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షత నిర్వహించారు. ఈ మహాసభకు కొండన్న ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ 40 నుంచి 45 సంవత్సరాల నుం డి మధ్యాహ్న భోజన కార్మికులుగా అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వ హిస్తున్నా కూడా పాలకులు ప్రభుత్వం పట్టించుకోవడంలేదని డా.బి.ఆర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ కార్మిక హక్కులు చట్టాల ను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాలరాస్తూ గౌరవ వేతనం పేరుతో నెలకు వెయ్యి రూపాయలు మాత్రమే రోజుకు 33 రూపాయలు మాత్రమే చెల్లిస్తూ కార్మికులతో కట్టు బానిసలలాగా వెట్టి చాకిరి చేయించుకుంటూ శ్రమదోపిడి చేయించుకుంటున్నారని అన్నారు. గతంలోని రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుందని అనేక పోరాటాలు, ఆందోళనలు చేసినా కెసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఏఐటియుసి ఆధ్వర్యంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉద్యమాలు ఆందోళనలు, పోరాటాలు చేసిన ఫలితంగా 2022వ సంవత్సరంలో మూడు వేల రూపాయలకు గౌరవ వేతనం పెంచుతూ అప్పటి కెసిఆర్ సర్కార్ జిఓని మాత్రమే ఇచ్చి అమలు చేయకుండా తొక్కి పెట్టిందని వారు ఆరోపించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక హామీలతో పాటు, కార్మికులకు 10 వేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామనిహామీ ఇచ్చిందని, ఈ హామీని వేగవంతంగా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.కార్మికులకు బకాయి వేతనాలను విడుదల చేయాలని కోరారు.

**ఏఐటియుసి యూనియన్ మండల నూతన కమిటీ ఎన్నిక**

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఊట్కూర్ మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటియుసి మండల యూనియన్ కమిటి అధ్యక్షురాలుగా వసంతమ్మ, ప్రధాన కార్యదర్శిగా సునిత, ఉపాధ్యక్షులుగా ప్రతాప్‌రెడ్డి, అనంతమ్మ, సహాయ కార్యదర్శిగా పద్మమ్మ, చంద్రమ్మ, కోశాధికారిగా లక్ష్మి, సలహాదారులుగా సుభాష్, మహబూబ్‌బీ, పార్వతమ్మ, కుప్పయ్య, పాపమ్మ, కిష్టయ్యలతో పాటు 11 మంది మండల కమిటి సభ్యులతో నూతన కమిటిని ఎన్నుకున్నారు.

# సామాజిక సేవలో రెడ్డిల పాత్ర ఆమోగం...

**-రెడ్డి సేవా సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే**



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**వెల్దండ, జనవరి 07 ప్రభాతవార్త:** సామాజిక సేవలో రెడ్డిల పాత్ర ఆమోగమని, తాను సంపాదించిన సంపదలో కొంత భాగం సామాజిక సేవకు ఉపయోగించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తోడేటి చెన్నారెడ్డి గార్డెన్‌లో ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గ పాలమూరు రెడ్డి సేవా సమితి నూతన క్యాలెండర్‌ను తాలూకా రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు పసుల శేఖర్‌రెడ్డి, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వంగూరు మండల జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం మంచి చేస్తూ ఎదుటి వ్యక్తులను గౌరవిస్తూ పోతుంటే మనకు కూడా మంచి జరుగుతుందన్నారు. రెడ్డి బంధువులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండటంతో సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఇతర కులాల్లోని నిరుపేద పిల్లలను దత్తత తీసుకొని వారికి విద్యాభివృద్ధి అందించే విధంగా కృషి చేయాలన్నారు. పిల్లలకు మంచి అలవాట్లపై దృష్టి సారించేలా సరైన మార్గంలో పంపాలని, చెడు అలవాట్లకు కులాలు, మతాలు లేవని, అటువంటి వ్యసానాల భారిన పడకుండా ఆరోగ్యకరమైన సమాజం వైపు నడిపి చైతన్యం తీసుకొచ్చే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మనందరం కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి సభ్యులు కాయితీ సాయిరెడ్డి, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రూపం వెంకట్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, యెన్నం కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవింద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కోశాధికారి గోళి కృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పావణిరెడ్డి, భారతీరెడ్డి, విజయలక్ష్మిరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

# మరణంలోనూ వీడని బంధం..

**- తండ్రి మరణాన్ని తట్టుకోలేక తనువుచాలించిన కూతురు - అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు..**



తండ్రి, కూతురు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 7, ప్రభాతవార్త :** తండ్రి అంత్యక్రియలకు వచ్చి మరణాన్ని తట్టుకోలేక కూతురు అక్కడే కుప్పకూలిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే జడ్చర్ల మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన దామోదర్(82) శనివారం రాత్రి అకాల మర్ణం చెందారు. విషయం తెలిసిన వెంటనే పరుగుపరుగున తన కూతురు సునీత(52) అక్కడికి చేరుకున్నది. అప్పటి వరకు బాగానే ఉన్నా అంతలోనే ఒక్కసారిగా తండ్రి పార్థీవదేహాని చూసి అక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే హుటాహుటిన కుటుంబీకులు ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే ఊపిరి ఆగినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఒక్కసారిగా కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒకే ఇంట్లో రెండు మరణాలు చోటుచేసుకోవడంతో అందరి హృదయాలను కలచివేసింది. తండ్రి కూతళ్లకు ఒకరంటే ఒకరికి చెప్పలేని ప్రేమ ఉండేదని అందుకే ఇలా కుప్పకూలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే జడ్చర్లలోని సాయినగర్‌లో నివాసంఉంటున్న సునీత నారాయణపేట జిల్లా మక్తల్ మండలం రుద్రసముద్రం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. ఈ విషయం తెలిసిన జడ్చర్లవాసులంతా అయ్యోపాపం అంటూ విచారం వ్యక్తం చేస్తున్నారు.

## 40వ సారి రక్తదానం చేసిన టంకరి శివప్రసాద్



**మహబూబ్‌నగర్,జనవరి 07 ప్రభాతవార్త :** సహాయ ఫౌండేషన్ అధ్యక్షులు టంకరి శివప్రసాద్ 40వ సారి రక్తదానం చేశారు. ఆదివారం జడ్చర్లకు చెందిన మేరీ ప్రకాష్ అనే రోగికి రెండు కిడ్నీలు పాడవడంతో హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కేర్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అక్కడి వైద్యులు ఆమెకు డయాలసిస్ చేయాల్సిన అవసరం ఉందని అందుకోసం ఆమెకు ఓ +పాజిటవ్ రక్తం అవసరం పడుతుందని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న టంకరి శివప్రసాద్ వెంటనే స్పందించి మహబూబ్‌నగర్ రామచంద్రాపూర్ గ్రామం నుంచి స్వచ్చందంగా వెళ్లి ఓ+పాజిటివ్ రక్తదానం చేసి రోగికి ప్రాణాలు కాపాడారు. దీంతో ఇప్పటికి నలభై(40) సార్లు రక్తదానం చేయడం జరిగిందని తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**దేవరకద్ర,జనవరి 07 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం డోకూర్‌లో ఆదివారం ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి క్రికెట్ టోర్న మెంట్‌ను ప్రారంభించారు. గ్రామ యువకుల అధ్వర్యంలో ప్రేమ్ కుమార్, సంపత్ కుమార్‌ల స్మారకార్థం ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.క్రీ డలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడు తాయన్నారు.అందుకే ప్రతి ఒక్కరు క్రీడలకు ప్రా ధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకొని టోర్నమెంట్‌ను టాస్ వేసి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు.ఈకార్య క్రమంలో గ్రామ నాయకులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా అనిల్‌కుమార్



**మక్తల్,జనవరి 07 ప్రభాతవార్త :** పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సభ్యులందరు ఏకగ్రీవంగా మండల అధ్యక్షునిగా తాళంపల్లి అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనిల్‌కుమార్‌స్వామి మాట్లాడుతూ నాపై ఉన్న నమ్మకాన్ని నాకుఇచ్చిన మండలఅధ్యక్షుడి పదవిని బాధ్యతతో శిరసావహిస్తూ,మండల ఆర్యవైశ్యసంఘం అభివృద్ధికొరకు పాటుపడ తానని తెలిపారు.ఆర్యవైశ్యులు సంఘంతోపాటు,రాజకీయంగా కూడా ఎదిగితే మనఐక్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం పెద్దలు, మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణెడ్డికి ఘన సన్మానం



**వెల్దండ,జనవరి07 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో పోతేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకుల మట్ట వెంకటయ్యగౌడ్, ఈదన్న గౌడ్, సత్యనారాయణ, బుచ్చయ్యగౌడ్, ఆంజనేయులు, భీమయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ...



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 07 ప్రభాతవార్త:** క్లాస్మెట్ క్లబ్ నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 1967 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాలకు వాటర్ ప్లాంట్‌ను బహుకరించారు. పాఠశాల అభివృద్ధికై ఇంద్రారెడ్డి రూ.15వేలు విరాళంగా ప్రకటించారు. పాఠశాలకు వాటర్ ప్లాంట్ బహుకరణ, విరాళం అందించిన వారితో పాటు సహకరించిన క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధిక్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షులు పోల శ్రీనివాసులు, క్లబ్ డివిజన్ అధ్యక్షులు చిగుళ్లపల్లి రమణకుమార్, క్లబ్ డివిజన్ కోశాధికారి కిరణ్, క్లబ్ ప్రతినిధులు, పొలిశెట్టి శివ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# భక్తి శ్రద్ధలతో లక్ష తులసి అర్చన..

**గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం.. భక్తులతో కిక్కిరిసిన వట్టెం ఆలయం..**



లక్ష తులసి అర్చనలో పాల్గొన్న మహిళలు



లక్ష తులసి అర్చనలో గోమాతకు పూజలు చేస్తున్న అర్చకులు

**బిజినేపల్లి,జనవరి 07 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచి న వట్టెం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీనివాసుడికి లక్ష నామాలతో లక్ష తుల సి అర్చన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్గశిర బహుళ ఏకాదశి సందర్భంగా లక్ష తులసి అర్చన మహోత్సవం అంగరంగ వైభవం గా కొనసాగింది. తిరు మలలో తిరుమలేశుడికి నిర్వహించే విధంగా వట్టెం శ్రీనివాసుడికి పూజలు చేపడుతుండడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని తిలకించి తన్మ యత్వం పొందారు. వేద పండితులు ఏడుకొండల వాడిని లక్ష నామాలతో కొలుస్తూ లక్ష తులసి దళాలతో అర్చన చేపట్టారు. భక్తుల తాకిడితో ఆలయం కిక్కిరిసిం ది. లక్ష తులసీ అర్చన సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని రమణీయంగా తీర్చిదిద్దారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ గోత్రనామాల తో అర్చన చేపట్టేలా ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద బ్రాహ్మణులచే ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా లక్షతులసి అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా గోమాత పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీని వాసుడు భక్తులకు దర్శనభాగ్యం కలిగించాడు. అనంతరం ఆలయఅర్చకులు స్వామివారి తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని శ్రీకళ శేషారెడ్డి దంపతులు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సందడి ప్రతాపరెడ్డి, చంద్రారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



రాఘవాపూర్‌లో శ్రీరామ అక్షింతలను అందచేస్తున్న గ్రామస్థులు

## గ్రామాల్లో అయోధ్య అక్షింతల వితరణ

**న్యాల్‌కల్, జనవరి 7, ప్రభాతవార్త:** ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య నుంచి శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో మండలానికి చేరుకున్న అక్షింతలను ఆదివారం మండలంలోని ఇబ్రహింపూర్, రాఘవాపూం, గంగ్వార్ గ్రామాల్లో శ్రీరామభక్తులు ఇంటింటికి తిరిగి అక్షింతలను వితరణ చేశారు. ఇళ్లకాడికి శ్రీరాముని నామాన్ని స్మరిస్తూ అక్షింతలతో చేరుకున్న భక్తులకు మహిళలు మంగళహారతులతో స్వాగతంపలికి అక్షింతలను గైకొని పూజామందిరంలో భద్రపర్చుకున్నారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు ఇబ్రహింపూర్, రాఘవపూర్, గంగ్వార్ గ్రామాల్లో శ్రీరామ నామ స్మరణతో మార్మోగాయి. ఆయా కార్యక్రమాల్లో ఇబ్రహింపూర్‌లో కె.భూమన్న, బి.శివ కుమర్, జగ్గు స్వామి, మనోహర్‌పాటిల్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

**హనుమాన్‌నగర్‌లో...**



సదాశివపేట హనుమాన్‌నగర్‌లో అక్షింతలను అందచేస్తున్న భక్తులు

**సదాశివపేట, జనవరి 7, ప్రభాతవార్త:** పట్టణంలోని హనుమన్ నగర్ కాలనీలో ఆదివారం శ్రీ వీరాంజనేయ మందిర కమిటి ఆధ్వర్యంలో అయోధ్య నుంచి పట్టణానికి సరఫరా అయిన అక్షింతలను కాలనీ భక్తులు శ్రీరాముడిని స్మరిస్తూ కాలనీలోని ప్రతి ఇంటికి అక్షింతలను అందచేశారు. అక్షింతలతో ఇండ్ల వద్దకు చేరుకున్న భక్తులకు ఇంటి వారు మంగళహారతులతో స్వాగతం పలుకగా భక్తులు అక్షింతలను అందచేశారు.

**చౌటకూరులో...**



చౌటకూరులో అయోధ్య అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

**చౌటకూరు, జనవరి 7, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆదివారం భక్తులు ఇంటింటికి అయోధ్య అక్షింతలను పంపిణి చేశారు. ఉత్తర ప్రదేశ్ అయోధ్య నుంచి మండలానికి చేరుకున్న అక్షింతలను గ్రామస్థులు శ్రీ రామ నామాన్ని స్మరిస్తూ గ్రామంలోని ప్రతి ఇంటికి చేరుకుని అక్షింతలను, అయోధ్య శ్రీరామాలయ ఆలయ చిత్ర పటాలను అందించారు. ఆదివారం గ్రామం శ్రీరాముని నామంతో మార్మోగింది.

**కొల్చారం మండలంలో...**



రాములవారి ఉత్సవ విగ్రహాలను శోభాయాత్రగా తీసుకెళ్తున్న దృశ్యం

**కొల్చారం, జనవరి 7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో స్థానిక రామాలయం నుండి ఆదివారం అయోధ్య సీతారాముల అక్షింతలను శిరస్సుపై పెట్టుకొని భక్తిపారవశ్యంతో తరలించారు. అక్షింతల వితరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా కర్ణ యూత్ సభ్యులు, సర్పంచి తిరుణగారి గోదావరి వెంకటరాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగరారి మల్లేశంగౌడ్, బీజేపీ నాయకులు శేఖులుయాదవ్, వడ్ల చంద్రం, భక్తులు సిద్ధిరాములు, సురేందర్ ఆధ్వర్యం లో ఇంటింటికీ వెళ్లి అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రవళిక మల్లేశంగౌడ్, అంగన్‌వాడీ టీచర్ శ్రీమతమ్మ, నాయకులు నర్సాగౌడ్, ఎంబరి శేఖర్, ఇతర సంఘాల అధ్య క్షులు వడ్ల ప్రభాకర్, సతీష్, హర్షద్, రాములు, రవితేజా, శివకుమార్, కర్ణ యూత్ సభ్యులు, యువకులు పెద్దఎత్తు పాల్గొన్నారు.

**కొంతాన్‌పల్లి గ్రామంలో...**



అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న సర్పంచి శ్రీనివాస్‌గౌడ్

**శివ్వంపేట, జనవరి7 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో సర్పంచి గైనిబైటి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అయోధ్య రాముల వారి అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకెళ్లడం జరిగింది. గ్రామానికి చేరుకున్న అయోధ్య రాముల వారి అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేయడం జరిగిం దని సర్పంచి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచి ఆకుల సంధ్యరాణి, శివకుమార్, వార్డు సభ్యులు గుండు శంకర్, మాజీ సర్పంచి దేవలింగం, వడ్ల లక్ష్మణ్, కుమ్మరి నవీన్, బీజేపీ మండల యువమోర్చా నాయకులు మంగలి నర్సింలు, భజరంగ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**శివ్వంపేట, జనవరి7 ప్రభాతవార్త:** శివ్వంపేట మండల పరిషత్ కార్యా లయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వడ్ల శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త కుటుంబ సభ్యు లను పరామర్శించారు. వడ్ల శ్రీనివాస్ మృతి చెందడం బాధాకరమని వారు అన్నారు. తమవంతు సహాయంగా ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీ టీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త బాధిత కుటుంబ సభ్యులకు వేరువేరుగా రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఏనుగు సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచి రామారం నర్సింలు, కుమార్‌గౌడ్, నరేందర్, వెంకటేష్, శ్రీనివాస్, యోగి తదితరులు ఉన్నారు.

# కోనాపూర్‌లో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం

**సదాశివపేట, జనవరి 7, ప్రభాతవార్త:** మండలంలోని కోనాపూర్‌లో పట్లోళ్ల శివనాగప్ప మెమోరియల్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పట్లోళ్ల నందీశ్వర్ సారథ్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను డిసిసిబి వైస్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు పట్నం మాణిక్యం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వా హకులు మాట్లాడుతూ టోర్నీలో 30జట్లు తలపడు తున్నాయన్నారు. టోర్నీ విజేతకు 25 వేల నగదు తోపాటు కప్పు, రన్నర్ జట్టుకు 15వేల రూపాయ లతోపాటు ట్రోఫీని అందించడం జరుగుతుంద న్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి, సామా జిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. టోర్నీ రెవఫరీలుగా పీఈటిలు కరుణాకర్ రెడ్డి, రామక్రిష్ణ, మనోహర్, సంతోష్‌రెడ్డి, క్రిష్ణ మోహన్‌లు వ్యవహరించినట్లు పేర్కొన్నారు. వాలీ బాల్ టోర్నమెంట్ సి.మల్లేశం, చోటుమియా, మోముమియా, మోసిన్, ఖమర్, ఉదయ్, సద్దాం నిర్వహణలో కొనసాగాయి. కార్యక్రమంలో సర్పంచ్ గోప్లారం శోభారాణిసంగమేశ్వర్, ఎంపిటిసిసభ్యులు అల్లం లలిత, బిఆర్ఎస్ నాయకులు చింత సాయి నాథ్, వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షులు ప్రసాది మధుశేఖర్, ఫౌండేషన్ చైర్మన్ పట్లోళ్ల చంద్రశేఖర్, కమిటీ సభ్యులు ధీరజ్, సంమేశ్వర్, శ్రీనివాస్, రమేష్, సుజనాకర్, శివకుమార్, బస్వరాజ్, దశరత్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, నాయకులు సుధీర్‌రెడ్డి, చీల మల్లన్న ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు నాయకులు పాల్గొన్నారు.



కూలిన చర్చి శ్లాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## కూలిన చర్చిని పరిశీలించిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, జనవరి 7, ప్రభాతవార్త:** కోహీర్ పట్టణంలోని లాలకుంటలో నూతనంగా నిర్మిస్తున్న మెథడిస్టు చర్చి శ్లాబ్ ఆదివారం కూలిపోగా ఒకరు మృతి చెందగా మరో 8 మంది గాయాలకు గురయ్యారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే పరామర్శించారు. హైద్రాబాద్‌లో జరుగుతున్న బిఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రమాదం విషయం తెలుసుకుని సమావేశం నుంచి అర్థాంతరంగా కోహీర్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించి క్షతగాత్రులను పరామర్శించారు.

## 9న జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 7, ప్రభాతవార్త:** కేంద్ర యువజన వ్యవ హారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9న సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి వక్తృత్వపోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూయువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం రంజిత్ రెడ్డి తెలిపారు. మై భారత్-వికసిత్ భారత్ 2047 అంశంపై జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 29 సంవత్సరాల వయసులోని వారు అర్హులన్నారు. భారత్-వికసిత్ భారత్ 2047 అంశంపె 7నిమిషాల వ్యవధిలో ఆంగ్లం, హిందీ, తెలుగు భాషల్లోని ఏదేని ఒక భాషలో ప్రసంగించాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి లో ప్రతిభ చాటిన యువతకు ప్రశంసా పత్రం, మెమెంటోలను అందించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ. 1 లక్ష, రెండవ బహుమతిగా రూ. 50 వేలు, మూడవ బహుమతిగా ఇద్దరు విజేతలకు 25వేల రూపాయల చొప్పున అందించడం జరగుతుందన్నారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొన దల్చిన యుత ఈ నెల 8న సాయంత్రం 5 గంటల లోపు నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో లేదా 9963056730లో సంప్రదించాలని సూచించారు.

## సెర్ప్ నూతన కార్యవర్గం

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 7, ప్రభాతవార్త:** సంగారెడ్డి పట్టణంలోని పాత డిఆర్‌డిఏ ఆవరణలో సెర్ప్ ఎల్1 ఎల్2 యూనియన్ సమావేశాన్ని ఆది వారం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గం అధ్యక్షులుగా యం శేఖర్, ఉపాధ్యక్షులుగా కె నగేష్, కార్యదర్శిగా బి దాసుబాబు, సహాయకార్యదర్శిగా పి.వరలక్ష్మి, కోశాధికారిగా వి.భాగ్యలక్ష్మి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటి బాధ్యులు మాట్లా డుతూ యూనియన్ అన్ని వేళలా అందుబాటులో ఉంటుందని, సహాయ సహకారాలు అందించేందుకు సిద్దంగా ఉంటామన్నారు.

## జహీరాబాద్‌లో మహిళా శక్తి సదస్సు

**జమీరాబాద్, జనవరి 7, ప్రభాతవార్త:**



మహిళా శక్తి సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధూ రావణ్

నియోజకవర్గంలోని 5మండలాలకు చెందినవారితో మహిళాశక్తి సదస్సును ఆదివారం పట్టణంలో నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి 12 సార్లు కాంగ్రెస్, 2 మార్లు బిఆర్ఎస్, ఒక మారు తెలుగుదేశం ఎమ్మెల్యేలుగా విజయం సాధించినా నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, మహిళలపై జరుగుతున్న అణచివేత దోరణి నిర్మూలన కెసం మహిళలతో పోరాటానికి పూనుకున్నామని సిద్దు రావణ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మహిళా శక్తి సంఘాలను ఏర్పాటు చేసి మహిళల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ భవిష్యత్తుపై మెరుగుపడేలా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫరీదా బేగం,అక్కి, సరిత, బుజ్జమ్మ, అఫ్రిన్ బేగం, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సంగమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం

**నిజాంపేట, జనవరి 7, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని గురుస్వామి ప్రదీప్‌రెడ్డి స్వగృహం లో రెడ్డిశెట్టి రవి గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప పడిపూజ నిర్వహించడం చాలా గొప్ప విషయమని ఆ అయ్యప్ప అనుగ్రహంతో మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. అయ్యప్ప స్వాముల భజన సంకీర్తనలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పెద్దపైడి నవీన్‌రెడ్డి, వీరమల్లు బాలకృష్ణ, రంజిత్‌గౌడ్, యాదగౌడ్, వెంకటేశం, సన్నిధానం అర్చకులు పంచాంగం వెంకటరమణ, ప్రముఖ బిల్డర్ పణ్యాల వెంకటరెడ్డి, మాజీ వార్డు సభ్యులు రామ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సోమేశ్వరస్వామి కళ్యాణోత్సవం



సోమేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 7, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సోమేశ్వస్వామి కళ్యాణోత్సవం, జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర ఉత్సవాలకు చేరుకున్న ఎమ్మెల్యేను ఆలయ కమిటి బాధ్యులు ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు పుష్ప నగేష్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య యాదవ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ ఐలేష్ యాదవ్, బిఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, టిఆర్ఎస్వీ కో-ఆర్డినేటర్ కృష్ణకాంత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకోవాలి

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి 7 ప్రభాతవార్త:** ఈశ్రమ్‌లో సభ్యత్వం చేసు కున్న కార్మికులు ప్రమాదశాత్తు మరణించిన, అంగవైకల్యం కలిగిన కార్మికుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా కోసం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలోని లేబర్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మిక అధికారి యాదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31, 2022 వరకు సభ్యత్వ చేసుకున్న, మరణించిన కార్మికులకు వరిస్తుందన్నారు. ఫిబ్రవరి 19, 2024 లోపు సంబంధిత ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, జనవరి 7, ప్రభాతవార్త:** మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన సావిత్రి,దుర్గపతిల నివాస పూరిగుడిసె శనివారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వెంకటేశం, విట్టల్‌లు 35 కేజీలు, మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.2వేల రుపాయలను బాధిత కుటుంబసభ్యులకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో సర్పంచి నీరజ, రామస్వామి, పవన్, రాజ్‌కుమార్‌లు ఉన్నారు.

## వికసిత భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

**నిజాంపేట, జనవరి 7, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోనూ, రజాక్‌పల్లి గ్రామాలలో ఆదివారం వికాసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వ హించారు. ఈ మేరకు నిరుపేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గూర్చి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి తెరపై ప్రదర్శించారు. నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉజ్వల గ్యాస్, ఆహార భద్రత అన్నయోజన, జల్ యోజన, ఆవాస్‌యోజన, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి వివరించారు. అనంతరం డ్రోన్‌ద్వారా ఉపయోగపడే లాభాలను వివరించి డ్రోన్‌ను ప్రదర్శించారు. అనంతరం వికాసిత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ, గ్రామ సర్పంచులు అనూష, ధర్మాసునీత, ఉప సర్పంచులు బాబు, సత్యనారాయణగౌడ్, విద్యుత్ ఏఈ గణేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్

# మెదక్ పట్టణంలో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్




ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కరాటే బెల్ట్‌లను ప్రధానం చేస్తున్న దృశ్యం

**మెదక్ అర్బన్, జనవరి 7 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో ఆదివారం రెన్‌జూకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వ హించినట్లు కరాటే మాస్టర్ దినకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈబెల్ట్ ఎగ్జామ్‌కు చీఫ్ ఎగ్జామినర్‌గా రెన్‌జూకీ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు, కరాటే సీని యర్ మాస్టర్ నగేష్, అబ్జర్వర్‌గా విద్యాసాగర్‌లు వ్యవహరించారని తెలిపారు. కరాటేబెల్ట్ ఎగ్జామ్‌లో వంద మంది విద్యార్థులు వివిధ మండలాల నుండి వచ్చినట్లు వారు తెలిపారు. ఎగ్జామ్‌లో పసుపు బెల్ట్ విభాగంలో చిన్మయి, వంశీ, వరుధిని, వెంకట్, హార్థిక, ప్రణవి, షూషువా, ప్రణయ్, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో జాన్, గ్రీన్ బెల్ట్ విభాగంలో సరేనా, ప్రణయ్, విక్రమ్, శ్రీరాం, బ్లూ బెల్ట్ విభాగంలో జయశ్రీ, సుహానిక, పృథ్వీక, వరుణ్, పర్పుల్ బెల్ట్ విభాగంలో విహాన్, నిశ్విత, కార్తీక్, బ్రౌన్ 4 విభా గంలో యశ్విత, రాజు, రుత్విక్, బ్రౌన్ 1 విభాగం లో సుమాన్, ప్రజీత్, బ్రౌన్ బెల్ట్ విభాగంలో హరిణి ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపార. ఈ బెల్ట్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కరాటే మాస్టర్ నగేష్ బెల్ట్‌లు ప్రధానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి సమజంలో కరాటే నేర్చుకోవడం అమ్మాయిలకు ఎతో అవసరం అన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతా రని తెలిపారు. ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రోగ్రామ్‌లో 173 పాఠశాలల్లో అమ్మాయిలకు అక్టో బర్ నుండి డిసెంబర్ వరకు కరాటే ప్రవేశపెట్టడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐశ్వర్య, అఖిల్, స్వరూప్, మనివర్ధన్, హనిష్క చారి, అక్షర తదితరులు పాల్గొన్నారు.



వనదుర్గమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు(ఇన్‌సెట్‌లో భవానిమాత)

## భక్తుల సందడితో వనదుర్గ భవాని మాత క్షేత్రం

**పాపన్నపేట, జనవరి 7, ప్రభాతవార్త:** జగత్‌జనని ఏడుపాయల వనదుర్గ భవానిమాత క్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆయా ప్రాం తాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పిల్లా పాపలతో ఆలయానికి చేరుకోవడం తో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. భక్తులు మొక్కుబడిలో భాగం గా తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి బోనాలు, ఒడిబియ్యం సమర్పించి అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బం దులు కల్గకుండా ఆలయ కమిటీ చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఇఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. భక్తులతో అర్చకులు శంకర్‌శర్మ, పార్థివ శర్మ, నాగరాజుశర్మ, మురళిశర్మ, రాజశేఖర్‌శర్మ వేద మంత్రాలు వల్లిస్తూ పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తన సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

## కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి



దత్తగిరి కాలనీలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

**జహీరాబాద్, జనవరి 7, ప్రభాతవార్త:** పట్టణంలోని దత్తగిరి కాలనీలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉండేం దుకే కార్యాలయాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. స్థానికంగా ఉంటూ నిత్యం కార్యకర్తలకు అందుబాటులోఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహారెడ్డి, పి రామలింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## భూంగోండేశ్వర మహారాజ్ అడుగుజాడల్లో నడుచుకోవాలి

### ఎమ్మెల్యే సంజీవరెడ్డి



భూంగోడేశ్వర్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, జనవరి 7 ప్రభాతవార్త:** భూంగోండేశ్వర మహారాజ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఎమ్మెల్యే డాక్టరు పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలో కరస్‌గుత్తి రోడ్డు లో మొదటి సంవత్సరం వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని భూంగోండేశ్వర విగ్రహనికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్లకుర్మలు, విద్యరంగంలోను వ్యాపారాల్లోను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఉదయం నుంచి నారాయణఖేడ్ నియో జకవర్గ గొల్లకుర్మలు పెద్దఎత్తున పాల్గొని భజన కార్యక్రమాలు నిర్వహించాచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపు మల్‌శెట్టి, నారాయణఖేడ్ మాజీ సర్పంచ్ కిష్టయ్య మాస్టర్, నరేష్‌యాదవ్, పండరి రెడ్డి, మారుతియాదవ్, మోహన్, ప్రభాకర్‌రెడ్డి, రమేష్ చౌహన్, నర్సింలు, గోపాల్, సంజీవ్‌యాదవ్, నర్సప్ప, రాజు, భూంగోండేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## షిరిడీ సాయిబాబా ఆలయంలో షెడ్ ప్రారంభం



షెడ్‌ను ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ నందారం శ్రీనివాస్‌గౌడ్

**అమీన్‌పూర్, జనవరి 7 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ సొంత నిధులు వెచ్చించి షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేసి దాతృత్వం చాటుకున్నారు. మున్సిపల్ పరిధిలోని బీరంగూడ ఎన్ఆర్ఐ కాలనీలో శ్రీ గణపతి కాశీ విశ్వేశ్వర సహిత శిరిడి సాయినాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సొంత నిధులతో ఏర్పాటు చేసిన షెడ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షిరిడి సాయినాథ ఆలయం ప్రాంగణంలో షెడ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎం ఎన్ఎన్‌జీ యువసేన సభ్యులు, ఎన్ఆర్ఐ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నజియర్ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు,జనవరి 7,ప్రభాతవార్త:** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త త్రిదండి చిన్నజీయర్‌స్వామిని ఆదివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. హైద రబాద్ శివారులోని ముచ్చింతల్ శ్రీసమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో వారిని కలుసుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుండి వరుసగా మూడోసారి విజయం సాధించడంపట్ల స్వామి అభినందనలు తెలిపారు. నియోజవర్గంలో 180కిపైగా దేవాలయాలు నిర్మాణానికి సహకారం అందిస్తున్నామని తెలి పారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు లక్ష్మీరాంనాయక్, దాసు, సోదరుడి కుమార్ సంతోష్‌గౌడ్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.



చిన్నజీయర్‌స్వామినుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు